సాక్షి సంగారెడ్డి

ఆదివారం । 18 । మే । 2025

ఓటమిని ఒప్పకోని.. మధుర సంకల్పం

చిన్నప్పుడే విద్యుత్ ప్రమాదంలో కాళ్లు చేతులు పోగొట్టుకున్నాడు మునిపల్లి మండలం కంకోల్ గ్రామానికి చెందిన మధుకుమార్. అయితేనేం విధివక్రీకరించినా ఓటమిని ఒప్పుకోని సంకల్ప బలంతో ముందుకెళ్లాలని నిర్ణయించుకున్నాడు. దేహముంది, ప్రాణముంది.. నెత్తురుంది.. సత్తువుంది ఇంతకంటే సైన్యముండునా అనుకున్నాడు. విశ్రమించక శ్రమించాడు. ఆశయాల అశ్వమెక్కి అదుపులేని కదను తొక్కి అవధులన్నీ అధిగమించాడు. వైకల్యం శరీరానికే కాని మనసుకు కాదనుకుని నిరాశకే నిరాశ పుట్టించి ముందుకెళ్తున్న మధుకుమార్ జీవితంపై ఈ వారం సండే స్టోరీ.

– బి. రాజశేఖర్, సంగారెడ్డి జోన్

సండే స్పెషల్



వివరాలు 8లో..

న్యూస్‌రీల్

కేతకీ హుండీ ఆదాయం రూ.29లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

ఝరాసంగం(జహీరాబాద్): శ్రీ కేతకీ సంగమేశ్వర ఆలయంలో హుండీ ఆదాయం లెక్కించారు. ఆదివారం గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. గత 75 రోజులగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు సమర్పించిన నగదు ఆదాయాన్ని లెక్కించారు. ఈ మేరకు రూ.29,19,554ల ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ చంద్రశేఖర్, ఈఓ శివ రుద్రప్ప, దేవాదాయ పర్యవేక్షకురాలు విజయలక్ష్మి, పాలకమండలి సభ్యులు నవాజ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ ఏడాది నుంచే పాలిటెక్నిక్ తరగతులు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: ఈ ఏడాది నుంచే పటాన్‌చెరు డివిజన్‌పరిధిలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం డిగ్రీ కళాశాల భవనంలో పాలిటెక్నిక్ తరగతులు ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. సంబంధిత అధికారులతో కలిసి డిగ్రీ కళాశాల భవనాన్ని శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా నియోజకవర్గంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేస్తూ గత ప్రభుత్వం జీరో జారీ చేసిందన్నారు. భవిష్యత్తులో పాలిటెక్నిక్ కళాశాలను ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు.

ప్రతి కాలనీకి రక్షిత మంచినీరు

నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీలకు సైతం రక్షిత మంచి నీరు అందించేందుకు కృషి చేస్తున్నామని కృషి డిఫెన్స్ కాలనీలో గల అపార్ట్‌మెంట్ కోసం రూ.20 లక్షల వ్యయంతో చేపట్టనున్న పైపులైన్ పనులకు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్‌తో కలసి ఆయన శంకుస్థాపన చేశారు. నూతన కాలనీల్లో మౌలిక వస్తువుల కల్పనకు నిధులు కేటాయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కృషి డిఫె న్స్ కాలనీ అధ్యక్షుడు అమరేందర్, ప్రధాన కార్యదర్శి మాణిక్‌రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిలో చేర్పించండి

ఎంఈఓ శంకర్



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎంఈఓ శంకర్ కోరారు. మండలంలోని ఆత్మకూర్ గ్రామంలో శనివారం 'బడిబాట'కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అర్హత కలిగి ఉపాధ్యాయులతో ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందుతోందన్నారు. పేద విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు.

కుటుంబ సర్వే డబ్బులివ్వండి

మహిళా సంఘాల సభ్యులు డిమాండ్

రామచంద్రాపురం(పటన్‌చెరు): ఆర్నెల్ల క్రితం ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో పాల్గొన్న ఎన్యూమరేటర్లకు ఇవ్వవలసిన డబ్బులను వెంటనే చెల్లించాలని మహిళ సంఘాల సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మహిళా సంఘాల సభ్యులు శనివారం మున్సిపల్ మేనేజర్ అఖిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సర్వే నిర్వహించిన ఎన్యూమరేటరులకు మున్సిపల్ కమిషనర్ రూ.10వేలు ఇస్తామని చెప్పి ఆర్నెల్లు గడిచినా ఇప్పటివరకూ చెల్లించలేదన్నారు. దీనిపై అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

పేదోడి ఆస్తికి భరోసా

- అందుకే భూభారతి చట్టం తీసుకొచ్చాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి
- ధరణితో ఒక కుటుంబానికే మేలు: మంత్రి దామోదర రాజనర్సింహ
- కొండాపూర్‌లో భూభారతి సదస్సు



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి దామోదర. చిత్రంలో మంత్రి పొంగులేటి, కలెక్టర్ క్రాంతి తదితరులు

కొండాపూర్(సంగారెడ్డి): పేదోడి హక్కు, ఆస్తిని కాపాడటం కోసమే భూభారతి చట్టం తీసుకొచ్చామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కొండాపూర్‌లో శనివారం జరిగిన భూ భారతి సదస్సులో మంత్రులు దామోదర రాజనర్సింహ, ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, కలెక్టర్ పాల్గొన్నారు. భూ భారతి పథకంపై సమీక్షించారు. అనంతరం పొంగులేటి మాట్లాడుతూ.. రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకే ఈ భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చినట్లు చెప్పారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన 'ధరణి'చట్టంతో పేదోడికి, సామాన్యులకు అన్యాయం జరిగిందన్నారు. భూ సమస్యలు పరిష్కరించుకునేందుకు అప్పీలు చేసుకునే అవకాశమే లేకుండా చేసిందని విమర్శించారు. ఈ గడ్డపై దున్నేవాడిదే భూమి, తెలంగాణలో భూమి హక్కు వంటి ఎన్నో పోరాటాలు జరిగాయని, అటువంటి స్ఫూర్తి కలిగిన తెలంగాణ ప్రజానీకానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని మండిపడ్డారు. మంత్రి దామోదర మాట్లాడుతూ.. ధరణి చట్టంలో పేదోడి భూములు ప్రొహిబిటెడ్, ఇనాం భూమల జాబితాలో పడిపోయాయని పేర్కొన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరిగినా సామాన్యుడికి ప్రయోజనం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ధరణి వల్ల ఒక కుటుంబానికి మాత్రమే మేలు చేకూరిందని, గత ప్రభుత్వంలో ఉన్న నాయకులు ప్రభుత్వ భూములను కాజేశారని ఆరోపించారు. పేదోడి హక్కును, ఆస్తిని కాపాడటం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 14న భూ భారతి చట్టాన్ని అమలు చేసిందని వివరించారు. కలెక్టర్ క్రాంతి మాట్లాడుతూ.. భూభారతి చట్టంపై ప్రతీ గ్రామంలో సదస్సులు నిర్వహించామని తెలిపారు. కొండాపూర్ మండలంలో 23 గ్రామాలకు గానూ 20 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించామని, ఇందులో 1,395 దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు. వీటిలో ఎక్కువగా పాసుబుక్ కనెక్షన్, డీఎస్ పెండింగ్ వంటి సమస్యలు ఎక్కువగా వచ్చాయన్నారు. సమీక్షలో టీజీ ఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీం, సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, మార్కెట్ కమిటీ చైర్మన్ కుమార్‌తో పాటు నాయకులు పాల్గొన్నారు.

మోడల్ ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం




ఇందిరమ్మ ఇల్లును ప్రారంభిస్తున్న పొంగులేటి, దామోదర, ఎంపీ సురేశ్ షెట్కార్

సంగారెడ్డి జోన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అవగాహన కల్పించేందుకు మోడల్ ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించారు. సంగారెడ్డి ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో రూ.5లక్షలతో నిర్మించిన మోడల్ ఇంటిని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, జహీరాబాద్ ఎంపీ సురేశ్ కుమార్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి, కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ పరితోశ్ పంకజ్ తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఇల్లులేని నిరుపేదలకు ఇందిరమ్మ పథకం ద్వారా రూ.5లక్షల ఆర్థిక సహాయం అందుతుందన్నారు. ప్రతీ ఒక్కరికి అవగాహన కలిగే విధంగా మోడల్ హౌస్‌ను నిర్మించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మాధురి తదితరులు పాల్గొన్నారు.

6వేల ఎకరాల్లో సాగు!

- నల్లవాగు ప్రాజెక్టు కింద ఖరీఫ్ సాగుపై అంచనాలు
- బోరుబావుల వద్ద వరి సాగుకు రైతన్నల ఆసక్తి





కల్హేర్(నారాయణఖేడ్): జిల్లాలోని మధ్య తరహా ప్రాజెక్టు నల్లవాగు కింద ఖరీఫ్ పంటల సాగుకు రైతాంగం సిద్ధమవుతోంది. ఈ ఏడాది 6 వేల ఎకరాల్లో పంటలు సాగవుతాయని అధికారులు అంచనాలు రూపొందించారు. ఈ ఏడాది వానాకాలంలో నల్లవాగు ప్రాజెక్ట్‌తోపాటు చెరువులు, కుంటల్లో చేరే నీటిపై రైతన్నలు ఆశలు పెట్టుకున్నారు. బోరు బావుల వద్ద ఎక్కువ మంది రైతులు వరి సాగుకే మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే వ్యవసాయ భూముల్లో దుక్కి దున్నే పనులు చేపడుతున్నారు. ఆరుతడి పంటలుగా కొందరు రైతులు మొక్కజొన్న తదితర పంటలు సాగు చేసే అవకాశం ఉంది. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచే పనిలో ఉన్నారు. వచ్చే జూన్‌లో వర్షాలు పడితే వరి నారు కోసం విత్తనాలు విత్తేందుకు సిద్ధంగా ఉన్నారు. జూలై, ఆగస్టు నెలలో సాగు పనులు ఊపందుకుంటాయి.

నల్లవాగు కింద వరి సాగుకు మొగ్గు...

జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టు నల్లవాగు ఆయకట్టు కింద ప్రాజెక్టు కుడి కాల్వ పరిధిలో సుల్తానాబాద్, గోసాయిపల్లి, పోచాపూర్, బీబీపేట, మార్డి,ఖానాపూర్(కె) వరకు 4,100 ఎకరాలు, ఎడమ కాల్వ పరిధిలోని బోక్కస్‌గాం, అంతర్‌గాం, కామారెడ్డి జిల్లా మార్డండ, తిమ్మనగర్ గ్రామాల వరకు 1,100 ఎకరాలు ఆయకట్టు ఉంది. ఎమర్జెన్సీ కెనాల్ పరిధిలో సుల్తానాబాద్, గోసాయిపల్లి సమీపంలో 60 ఎకరాలు ఆయకట్టు ఉంది. అదనంగా ఆయకట్టుతోపాటు మొత్తం 6 వేల ఎకరాల్లో సాగు చేయనున్నారు. కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లోని చెరువులు, కుంటలు, బోరుబావుల వద్ద మరో 15 వేల ఎకరాల వరకు వరి, ఇతర పంటలు సాగు చేసేందుకు ఆసక్తిగా ఉన్నారు.

ఎరువులు, విత్తనాలు సరఫరా కోసం చర్యలు..

వర్షాకాలంలో పంటల సాగు కోసం రైతన్నలు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయనున్నారు. పంట సాగు అంచనాల మేరకు అధికారులు రైతుల కోసం ఎరువులు, విత్తనాలు అందుబాటులోకి తెచ్చేందుకు ముందస్తు చర్యలు చేపట్టారు. తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ వరితోపాటు జొన్న, మొక్కజొన్న, ఇతర విత్తనాలు రైతులకు దగ్గరలో ఉండేటట్లు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలు, డీలర్ల ద్వారా ఎరువులు, విత్తనాలు విక్రయించనున్నారు.

సూచనలు పాటించాలి



వర్షాకాలంలో సాగు కోసం రైతులు సూచనలు పాటించాలి. నీటి సరఫరా అవకాశం మేరకు వరి, మొక్కజొన్న, పత్తి ఇతర పంటలు వేస్తే బాగుంటుంది. రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు సరిపోయేంత డీలర్ల వద్ద అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే ఫర్టిలైజర్ షాపు దుకాణదారులతో సమావేశం ఏర్పాటు చేశాం. విత్తనాలు, ఎరువుల కొరత ఉండకుండా సరఫరా చేయాలని ఆదేశించాం. పంట సాగులో తెగుళ్లు, ఇతర సమస్యలు వస్తే అధికారులు, శాస్త్రవేత్తలను సంప్రదించాలి. వారి సూచన మేరకే మందులు వాడితే బాగుంటుంది.

– నూతన్‌కుమార్, ఏడీఏ, నారాయణఖేడ్

టైలరింగ్‌లో నైపుణ్యాలు పెంచుకోవాలి



కుట్టు మెషీన్, పత్రాలను అందజేస్తున్న వికాస్ వ్యవస్థాపకులు కొత్తకాపు లక్ష్మారెడ్డి తదితరులు

- ఆంధ్రప్రదేశ్ ప్రొడక్టివిటీ కౌన్సిల్ కార్యదర్శి సుర రాజగోపాల్‌రెడ్డి
- 'వికాస్'ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మెషీన్ల పంపిణీ

జహీరాబాద్ టౌన్: మహిళలు స్వశక్తితో ఎదగడానికి కుట్టు శిక్షణ దోహదపడుతుందని, టైలరింగ్‌లో ఎప్పటికప్పుడు సాంకేతిక నైపుణ్యాలు పెంచుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రొడక్టివిటీ కౌన్సిల్ కార్యదర్శి (హైదరాబాద్) సుర రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నాల్జెడ్ సర్వీసెస్(వికాస్) మహిళా సశక్తీకరణ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం ద్వారా 240 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమెషీన్లను పంపిణీ చేశారు. పస్తాపూర్ ఎస్‌వీ కన్వెన్షన్ హాల్ శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ...ఈ ప్రాంత ప్రజలు, మహిళలు ఆర్థికంగా స్వావలంబన కోసం కొత్తకాపు లక్ష్మారెడ్డి చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. మహిళలు టైలరింగ్‌ను కెరియర్‌గా మార్చుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. వికాస్ వ్యవస్థాపకులు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... మూడు విడతలుగా 800 మంది మహిళలకు శిక్షణ ఇచ్చి ఉచితంగా మెషీన్లు పంపిణీ చేశామన్నారు. భవిష్యత్తులో అనేక కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వికాస్ ట్రస్టు సభ్యులు రావి నర్సింహ్మారెడ్డి, పటేల్ సుధాకర్ రావు,ప్రాజెక్టు డైరెక్టర్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ కొత్తకాపు సురేందర్‌రెడ్డి, డైరెక్టర్ గంకటి శుక్లవర్ధన్ రెడ్డి, మహిళా కో-ఆర్డినేటర్ కొత్తకాపు శిరీష, రాంచంద్రారెడ్డి, అభిలాష్, ఆప్కో డైరెక్టర్లు శ్రీనివాస్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మామిడి రకాల ప్రదర్శన

- హాజరైన జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి జోన్: సంగారెడ్డి పట్టణంలో ఫల పరిశోధన స్థానంలో రెండు రోజులపాటు నిర్వహించిన మామిడి రకాల ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. కలెక్టర్ వల్లూరు క్రాంతి శనివారం హాజరై వివిధ రకాల మామిడి పండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రాంతి మాట్లాడుతూ పరిశోధన స్థానం సంగారెడ్డిలో ఉండటం జిల్లాకు ఎంతో గర్వకారణమన్నారు. అనంతరం ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ విద్యార్థులతో కోర్సుకు సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఫల పరిశోధన స్థానం హెడ్ సుచిత్ర, శాస్త్రవేత్తలు హరికాంత్ నితీశ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బెస్ట్ అవైలబుల్ పథకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కవిత ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసే పాఠశాలల్లో ఐదేళ్లుగా పదో తరగతి ఫలితాల్లో 90 శాతం ఉత్తీర్ణత, 50 శాతం విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించి ఉండాలని చెప్పారు. పాఠశాలలు ప్రభుత్వ గుర్తింపును కలిగి ఉండాలని చెప్పారు.

పార్క్ పరిసరాలు పరిశుభ్రం

ఆహ్లాదం చెత్త పాలు కథనానికి స్పందించిన మున్సిపల్ అధికారులు



సంగారెడ్డి టౌన్: సంగారెడ్డిలోని పదవ వార్డ్ హౌసింగ్ బోర్డ్‌లోని పట్టణ ప్రకృతి వనంలో చెత్తకుప్పల మధ్యనే చిన్నారులు ఆడుకుంటున్నారంటూ శుక్రవారం 'ఆహ్లాదం చెత్తపాలు'పేరుతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శనివారం ఉదయం మున్సిపల్ అధికారులు సిబ్బందితో పార్కు వద్దకు చేరుకుని పార్కులో పేరుకుపోయిన చెత్తను తొలగించడంతోపాటు పరిసరాలను శుభ్రం చేశారు. పార్కు పరిసరాలు బాగు చేయించడం పట్ల స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

సాక్షి ఎఫెక్ట్

ప్రచార బోర్డులు తొలగింపు

'సాక్షి' కథనానికి స్పందించిన పంచాయతీ అధికారులు

వట్‌పల్లి(అందోల్): ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్న తరుణంలో పత్తి కంపెనీదారులు రహదారుల వెంట ఉన్న హరితహారం చెట్లకు నష్టం కలిగేలా మేకులతో పెద్ద ఎత్తున ప్రచార బోర్డులు అతికించారు. దీనిపై 'సాక్షి'దినపత్రికలో శుక్రవారం 'చెట్టంతా ప్రచారం'అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. శనివారం మండంలోని నాగులపల్లి, గౌరైకల్, వట్‌పల్లి గ్రామాల్లో పంచాయితీ సిబ్బంది హరిత హారం చెట్లకు కొట్టిన ప్రచార బోర్డులను తొలగించే పనులు చేపట్టారు. ఎవరైనా హరితహారం చెట్లకు నష్టం కలిగేలా పనులు చేపడితే జరిమానాలు విధిస్తామని ఎంపీడీఓ అంజయ్య తెలిపారు.



చెట్టుకు పెట్టిన ప్రచార బోర్డును తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

ఈత.. చేయూత



హత్నూర మండలం బోరుపట్ల గ్రామంలో పెరిగిన 3000 ఈత మొక్కలు

కుల వృత్తినే నమ్ముకున్నాం



ఏళ్లుగా కుల వృత్తినే నమ్ముకుని జీవిస్తున్నాం. గ్రామంలో కల్లు అమ్ముకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. కానీ సరిపడా ఈత చెట్లు లేక ఇబ్బంది పడుతున్నాం. ఉపాధి హామీ ద్వారా మా గ్రామంలోనే 3000 మొక్కలను నాటి పెంచుకున్నాం. ఏడాది గడిస్తే ఈత చెట్లు గీతకొస్తాయి.

– నర్సాగౌడ్ గీత కార్మికుడు

జిల్లాలో ఎక్కడా లేదు



జిల్లాలో ఎక్కడాలేని విధంగా 3000 మొక్కలను ఒకే దగ్గర రెండు ఎకరాలలో ఉపాధి హామీ పథకం ద్వారా ఈత మొక్కలను నాటాం. గ్రామంలో కల్లుగీత కార్మిక సొసైటీని ఏర్పాటు చేశాం. రెండేళ్ల క్రితం మొక్కలు నాటి వాటిని సంరక్షించుకుంటూ వస్తున్నాం. మరో ఏడాది అయితే ఈత చెట్లు గీతకు వచ్చి గీత కార్మికులకు ఉపాధిని అందించనున్నాయి. మేము కష్టపడ్డ శ్రమకు ఫలితం దక్కనుంది.

– ఏపీవో ప్రవీణ్ కుమార్

ఉపాధి హామీ పథకంలో 3 వేల మొక్కలు పెంపకం

- మరో ఏడాదిలో చేతికి..
- గౌడన్నలకు ఆర్థిక ప్రయోజనం
- 25 గీత కార్మిక కుటుంబాలకు ఆర్థిక స్వావలంబన

హత్నూర(సంగారెడ్డి): కల్లుగీత కార్మికులకు చేయూతనిచ్చేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా ఈత మొక్కలను నాటారు. కల్లుగీత కార్మికుల సంక్షేమంతో పాటు కులవృత్తిని ప్రోత్సహించాలన్న సంకల్పంతో ప్రభుత్వం అధికారులు ఈత మొక్కలను నాటారు. హత్నూర మండలం బోరపట్ల గ్రామ శివారులో గీత పారిశ్రామిక సొసైటీకి ప్రభుత్వమే రెండెకరాల ప్రభుత్వ భూమిని గతంలో అందించింది. ఈ భూమిలో ఉపాధి హామీ పథకం కింద 2022–23 సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా మూడు వేల ఈతమొక్కలను నాటారు. రెండేళ్లుగా ఉపాధి హామీ కూలీల ద్వారా మొక్కలను సంరక్షిస్తూ ఎప్పటికప్పుడు నీరు పోస్తూ కాపాడుతూ వచ్చారు. మరో ఏడాది అయితే 3000 ఈత మొక్కలు గీత కార్మికులకు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. గ్రామంలోని 25 గీత కార్మిక కుటుంబాలకు ఈత కల్లు ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం లభించనుంది. ఏడాది గడిస్తే ఒక్కో ఈత చెట్టు నుంచి సుమారు ఐదు లీటర్ల స్వచ్ఛమైన కల్లు వస్తుంది. దీంతో గీత కార్మికులకు ఆర్థికంగా నిలదొక్కుకుంటారు. జిల్లాలోని ఎక్కడాలేని విధంగా మూడు వేల చెట్ల వనం రోడ్డుకు పక్కనే ఉండటంతో రహదారి వెంబడి వెళ్లే వాహనదారులు సైతం స్వచ్ఛమైన కల్లును ఆస్వాదించే అవకాశం ఉంది. అంతేకాకుండా ప్రతీ గ్రామంలోని నర్సరీలలో ప్రభుత్వం ప్రత్యేకంగా 500 ఈత మొక్కలను పెంచుతుంది. వీటిని కూడా గీత కార్మికులకు అందించేందుకు శ్రీకారం చుట్టారు. ఏది ఏమైనా గ్రామీణ ప్రాంతాల్లోని కల్లుగీత కార్మికుల కులవృత్తిని కాపాడుకునేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషితోపాటు ఉపాధి హామీ పథకం ద్వారా ఇలాంటి ఈత వనాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని పలువురు ప్రశంసిస్తున్నారు. ఈత మొక్కల పెంపకాన్ని రాష్ట్ర ఉపాధి హామీ పథకం జాయింట్ కమిషనర్ షఫీ ఉల్లా, జిల్లా డీఆర్డీఓ ప్రాజెక్టు మేనేజర్ మణికుమార్తో పాటు జిల్లా స్థాయి అధికారులు పరిశీలించారు.



ఈత మొక్కలకు నీళ్లు పోస్తున్న ఉపాధి కూలీలు

పకడ్బందీగా సప్లిమెంటరీ పరీక్షలు

అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



సమీక్షలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి జోన్: జిల్లాలో ఇంటర్మీడియెట్ సప్లమెంటరీ పరీక్షల నిర్వహణకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. కలెక్టరేట్‌లో విద్యాశాఖ అధికారులతో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలపై శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 28 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలో జంబ్లింగ్ విధానం ఉందని విద్యార్థులు పరీక్ష కేంద్రానికి అరగంట ముందుగా చేరుకోవాలని సూచించారు. మొబైల్ ఫోన్లకు అనుమతి లేదన్నారు. పరీక్ష కేంద్రాలకు విద్యుత్, పరిశుభ్రతతోపాటు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు ఇతర అత్యవసర మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సమీక్షలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రభుత్వ ఆస్పత్రిలో శిశువు

- వదిలి వెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు


ఆడ శిశువు

సంగారెడ్డి: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని రేకుల షెడ్డులో 20 రోజుల ఆడ శిశువును గుర్తు తెలియని వ్యక్తులు శనివారం వదిలి పెట్టి వెళ్లారు. ప్రస్తుతం శిశువు ఆరోగ్యం బాగానే ఉందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ కుమార్ తెలిపారు. శిశువును ఒకటి రెండు రోజుల్లో శిశుగృహానికి అప్పగించనున్నట్లు ఆయన వెల్లడించారు.

బేకరీలో చోరీ

జహీరాబాద్: బేకరీలో దొంగలు పడి రూ.లక్షకు పైగా ఎత్తుకెళ్లిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... జహీరాబాద్ పట్టణంలోని 65వ జాతీయ రహదారిపై ఉన్న ఫ్రెండ్స్ బేకరీలోకి శనివారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి కౌంటర్‌లో ఉన్న రూ.1.20లక్షల నగదును దొంగిలించారు. ముగ్గురు దొంగలు మోటారు సైకిల్‌పై వచ్చినట్లు సీసీ కెమెరాలో రికార్డుయ్యాయి. యజమానికి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపడి గేదె మృతి

కోహెడరూరల్(హుస్నాబాద్): పిడుగుపాటుకు పాడి గేదే మృతి చెందిన ఘటన మండలంలోని శనిగరం గ్రామంలో చోటు చేసుకుంది. బాధిత రైతు వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన వర్కోల్ సుధాకర్ రోజుమాదిరిగానే తన వ్యవసాయ పొలం వద్ద పాడి గేదెను కట్టేసి ఇంటికి వచ్చాడు. తెల్లవారు జామున బావి వద్దకు వెళ్లి చూడగా శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి పిడుగుపడి పాడి గేదె మృతి చెందింది. సుమారు రూ.85వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

మరోచోట విద్యుదాఘాతంతో..

గజ్వేల్‌రూరల్: విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని అహ్మదీపూర్‌లో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం... రైతు నర్సారెడ్డి రోజు మాదిరిగానే గేదెను తన వ్యవసాయ పొలం వద్ద మేతకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో పొలం సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన విద్యుత్ వైర్లు తగిలి గేదె మృతి చెందింది. రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధిత రైతు పేర్కొన్నారు.

గూడ్స్ బోగీలో పొగలు

చిన్నశంకరంపేట(మెదక్): బొగ్గు రవాణా చేస్తున్న గూడ్స్ రైలులో పొగలు రావడంతో అప్రమత్తమైన రైల్వే సిబ్బంది రైలును చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లి రైల్వేస్టేషన్‌లో నిలిపివేశారు. శనివారం రామగుండం నుంచి రాయచూర్‌కు బొగ్గును తరలిస్తున్న గూడ్స్ రైలు బోగీలో పొగలు వచ్చాయి. గూడ్స్ మధ్యలోని బోగీలో నిప్పు రాజుకుని పొగలు రావడం గమనించిన రైల్వే సిబ్బంది అప్రమత్తమై గూడ్స్ రైలును మిర్జాపల్లి రైల్వేస్టేషన్‌లో నిలిపివేశారు. రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ ప్రసన్నకుమార్ వెంటనే రామాయంపేట ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సకాలంలో చేరుకున్న ఫైర్ సిబ్బంది బోగీలోని నిప్పును చల్లార్చారు. దీంతో రైల్వే అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. రైల్వే సేఫ్టీ అధికారులు వచ్చి తనిఖీ చేసే వరకు రైలు మిర్జాపల్లిలోనే హల్టింగ్ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

మహీంద్ర కర్మాగారంలో అగ్నిప్రమాదం


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

జహీరాబాద్: జహీరాబాద్ సమీపంలోని మహీంద్ర అండ్ మహీంద్ర మినీ ట్రక్కుల తయారీ కర్మాగారంలో శుక్రవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో కర్మాగారంలోని స్టోర్‌రూం దగ్ధమైనట్లు ఫైర్ అధికారులు పేర్కొన్నారు. షాట్ సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకున్నట్లు తెలిపారు. కర్మాగారానికి సంబంధించిన ఫైరింజన్లతో పాటు ప్రభుత్వ ఫైర్ స్టేషన్ ఫైరింజన్ సహాయంతో మంటలను ఆర్పేశారు. వాహనాలకు ఉపయోగించే పరికరాలు కాలిపోయినట్లు తెలుస్తోందన్నారు.


మధు కుమార్‌ను సన్మానించి, ల్యాప్‌టాప్‌ను అందిస్తున్న జిల్లా కలెక్టర్ క్రాంతి


తల్లిదండ్రులతో మధుకుమార్



ఓటమిని ఒప్పుకోని.. మధుర సంకల్పం

కాళ్లు, చేతులు లేకపోయినా ఉత్తమ ప్రతిభ

- 10వ తరగతిలో 86 శాతంతో ఉత్తీర్ణత
- లక్ష్యసాధనకు అడ్డురాని వైకల్యం
- ఐఏఎస్ కావాలన్నదే లక్ష్యం
- సహకరిస్తున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్నేహితులు
- మధుకుమార్ స్ఫూర్తికి అభినందనలు

సంగారెడ్డి జోన్: సంకల్పం ఉంటే వైకల్యం అడ్డు కాదని నిరూపించాడు. నోటితోనే పెయింటింగ్ వేసి అందరి ప్రశంసలు అందుకున్నాడు. ఆత్మవిశ్వాసం కోల్పోకుండా లక్ష్యసాధన వైపు ముందడుగు వేశాడు. ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 86% మార్కులు సాధించి, ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిగా నిలిచాడు. విద్యుదాఘాతం తగిలి రెండు కాళ్లు, రెండు చేతులు కోల్పోయినా మనోధైర్యం కోల్పోలేదు. ఐఏఎస్ అయి ప్రజలకు సేవ చేయాలన్నదే తన కోరిక అని మునిపల్లి మండలం కంకోల్ గ్రామానికి చెందిన మధు కుమార్ 'సాక్షి'తో చెప్పాడు.

స్ఫూర్తిగా నిలిచి..

విధి వెక్కిరించినా అందరితో పాటు చదువులో ముందుకు సాగుతున్నాడు. ప్రతిరోజు తల్లిదండ్రులు, స్నేహితుల సహకారంతో వీల్ చైర్‌పై పాఠశాలకు వెళ్లేవాడు. తనకు ఉన్న వైకల్యాన్ని మరిచి పోయి అందరితో కలిసి, మెలిసి చదువుకున్నాడు. పరీక్షల సమయంలో ప్రణాళికాబద్ధంగా సమయం కేటాయించి చదువుకున్నాడు. పుస్తకాల్లోని పేజీలను తన నాలుకతో పాటు కోల్పోయిన కాలు చివరి భాగంతో మార్చుకుంటున్నాడు. ఈ విధంగా బాగా చదువుకుని స్నేహితుడి సహకారంతో పరీక్షలు రాశాడు. దివ్యాంగులకు ఒక సబ్జెక్టును మినహాయిస్తారు. దీంతో 500 మార్కులకు గాను 430 మార్కులు సాధించి అందరి నోట శభాష్ మధు అనిపించుకున్నాడు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన మధు కుమార్‌ను కలెక్టర్ వల్లూరు క్రాంతి సన్మానించి అభినందించి, ల్యాప్ టాప్‌ను అందజేశారు. భవిష్యత్తులో చదువుకునేందుకు తమ వంతుగా పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. పాఠశాల తనిఖీ సమయంలో మధును గమనించిన కలెక్టర్ బాగా చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రోత్సహించారు.


తన కాలు చివరి భాగంతో పేజీని తిప్పుతున్న మధు

చిరునవ్వుతో ముందడుగు

మునిపల్లి మండల పరిధిలోని కంకోల్ గ్రామానికి చెందిన మధు కుమార్ అదే గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్నాడు. అందరితో కలిసి మెలిసి ఉంటూ చదువుతో పాటు పాఠశాలలో నిర్వహించే ప్రతి కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనేవాడు. 2019 సెప్టెంబర్ 15న తోటి స్నేహితులతో సరదాగా ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో పక్కనే ఉన్న విద్యుత్ తీగలను గమనించకపోవడంతో రెండు చేతులు తీగలకు తగిలాయి. రెండు కాళ్లకు ఎర్తింగ్ వచ్చి షాక్ తగిలి కింద పడిపోయాడు. వెంటనే చికిత్స కోసం ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు రెండు కాళ్లు, రెండు చేతులు తీసేయాలని, అప్పటికీ మధు బతుకుతాడో లేదోనని చెప్పారు. మరణం అంచు వరకు వెళ్లిన కుర్రాడు ప్రాణాలతో బయటపడ్డాడు. తోటి వారి సహాయం లేకుండా కదలలేని స్థితిలో ఉన్నా ఆత్మవిశ్వాసం కోల్పోకుండా సంకల్ప బలంతో ముందడుగు వేస్తూ జీవిస్తున్నాడు.


మధుకుమార్‌కు తినిపిస్తున్న తల్లి ప్రమీల

నోటితో పెయింటింగ్..

నోటితోనే పెయింటింగ్ వేసి అందరి ప్రశంసలు పొందుతున్నాడు. ప్రముఖ సినీ నటి సమంత నిర్వహించే సామ్ జామ్ షోకు హాజరై అక్కడ మెగాస్టార్ చిరంజీవి చిత్రపటాన్ని నోటితో గీసి ప్రశంసలు పొందాడు. అంతేకాకుండా ప్రముఖ స్టార్‌లు ప్రభాస్, వెంకటేష్, పవన్ కల్యాణ్, అల్లు అర్జున్‌లతో పాటు వివిధ రకాల చిత్రాలు వేసి అందరితో ప్రశంసలు అందుకున్నాడు.

ఐఏఎస్ అవ్వడమే లక్ష్యం..


నాలుకతో పేజీని తిప్పుతున్న విద్యార్థి మధు

కాళ్లు, చేతులు లేకపోయినా నా తల్లిదండ్రులు, గురువులు, స్నేహితుల సహకారంతో చదువుకోవటంతో పాటు అన్ని పనులు చేసుకోగలుగుతున్నా. ఉపాధ్యాయుల సూచనల మేరకు ప్రణాళికాబద్ధంగా చదువుకొని మంచి ఫలితాలు సాధించాను. అప్పటి సంగారెడ్డి జిల్లా కలెక్టర్ హనుమంతరావు పాఠశాలకు తనిఖీకి వచ్చిన సమయంలో నిరుపేద విద్యార్థులకు, తనలాంటి వారిని పలకరించే విధానం, చేసే సహాయ గుణాలకు ఆకర్షితుడినయ్యాను. అలాగే ప్రస్తుత కలెక్టర్ వల్లూరు క్రాంతి సైతం విద్యార్థులను ప్రోత్సహించడం చూసి స్ఫూర్తి పొందాను. నేను కూడా ప్రతి ఒక్కరికీ సహాయపడాలని ఐఏఎస్ కావాలని లక్ష్యంగా పెట్టుకున్నా.

– మధు కుమార్, విద్యార్థి, కంకోల్ గ్రామం, మునిపల్లి మండలం

రాంగ్‌రూట్‌లో వచ్చి.. తుఫాన్‌ను ఢీకొట్టి..

తీవ్ర గాయాలై వ్యక్తి మృతి

టేక్మాల్(మెదక్): రాంగ్‌రూట్‌లో వచ్చి వాహనాన్ని ఢీకొట్టి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన టేక్మాల్ మండలంలోని బొడ్మట్‌పల్లి శివారులో 161హైవేపై శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. వట్‌పల్లి మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన రాయికోడ్ నర్సింలు (43)బైక్‌పై ముస్లాపూర్ నుంచి బొడ్మట్‌పల్లికి రాంగ్‌రూట్‌లో వస్తున్నాడు. నారాయణఖేడ్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న తుఫాన్ వాహనానికి ఢీకొని తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు 108లో జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని టేక్మాల్ పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు.

గోడను ఢీకొట్టి వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: షాపు గోడను ఢీకొట్టి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని గండిగూడెంకు చెందిన పాండు శనివారం తెల్లవారుజామున తన భార్య భాగ్యలక్ష్మిని సుల్తాన్‌పూర్‌లో దించి వస్తున్నాడు. ఈ క్రమంలో సుల్తాన్‌పూర్ ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో వెళ్తూ రోడ్డు పక్కన ఉన్న షాపు గోడను ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు సాయి తేజ ఇచ్చిన ఫిర్యాదు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ...

జహీరాబాద్ టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. టౌన్ ఎస్ఐ. కాశీనాథ్ వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన గడ్డపోల శ్రీకాంత్ ఈ నెల 15న నారాయణఖేడ్ నియోజకవర్గం నాగలగిద్ద మండలం దామరగిద్ద గ్రామంలో జరిగే పెళ్లి వేడుకకు వెళ్లాడు. అదే రోజు రాత్రి తిరిగి బైక్‌పై జహీరాబాద్‌కు వస్తుండగా పట్టణ సమీపంలో సోహెల్ అనే యువకుడు పల్సర్ బైక్‌తో వేగంగా వచ్చి శ్రీకాంత్‌ను ఢీకొట్టాడు. తీవ్ర గాయాలైన అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో సంగారెడ్డికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


తూప్రాన్‌లో మార్చురీ గది వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

చిన్నారులను చిదిమేసిన 'పిడుగు'

కన్నవారికి కడుపుకోత మిగిల్చిన అకాల వర్షం

- ఆడుకుంటున్న చిన్నారులపై ప్రకృతి ప్రకోపం
- ఇద్దరు బాలురు దుర్మరణం
- మరొక బాలుడికి తృటిలో తప్పిన ప్రమాదం
- పడాల్‌పల్లిలో ఘటన

తూప్రాన్: గాలి దుమారం వీచింది. చిన్నారుల ఆటల ప్రాంగణం చెల్లాచెదురైంది. ఉరుము ఉరుమడంతో భయంతో చెట్టు కిందకు వచ్చిన చిన్నారులపై పిడుగు పడింది. ఇద్దరు చనిపోగా మరొక బాలుడు తీవ్ర అస్వస్థతతకు గురయ్యాడు. అకాల వర్షాలు, ఈదురు గాలుల నేపథ్యంలో చిన్నారులను చిదిమేసిన ఈ ఘటన తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని పడాల్‌పల్లిలో పెనువిషాదం మిగిల్చింది. ఆటలు ఆడుకునేందుకు వెళ్లిన చిన్నారులు విగత జీవులుగా మారడంతో ఆ కుటుంబాలు కడుపుకోతకు గురై తల్లడిల్లిపోయాయి.

తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని పడాల్‌పల్లిలో శనివారం సాయంత్రం వేసవి సెలవుల నేపథ్యంలో ఐలేని, లక్ష్మి దంపతుల పెద్ద కుమారుడు యశ్వంత్(13), పంబల్ల ముత్యాలు, లక్ష్మి దంపతుల రెండవ కుమారుడు ప్రసాద్ (15), మొకద్దాం సుధాకర్, రజిత దంపతుల కుమారుడు రవికిరణ్‌తో పాటు మరి కొందరు చిన్నారులు పెద్దకుంట వద్దకు చేరారు. అక్కడ వ్యవసాయ పొలంలోని ఖాళీ ప్రదేశంలో వారంతా కేరింతలు కొడుతూ క్రికెట్ ఆటలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలోనే గాలి దుమారం, ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం ప్రారంభమైంది. క్రికెట్ ఆడుతున్న చిన్నారుల్లో కొందరు తమతమ ఇళ్లలోకి పరుగులు తీశారు. నలుగురు చిన్నారులు పెద్దకుంటపై ఉన్న మామిడి చెట్టు వద్దకు గాలికి మామిడి కాయలు కిందపడుతాయని, వాటిని తెచ్చుకునేందుకు క్రికెట్ బ్యాట్లతో వెళ్లారు. అదే సమయంలో భారీ మెరుపులతో పిడుగుపడటంతో యశ్వంత్(13), ప్రసాద్(15)లు శరీరంపై కాలిన గాయాలతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. రవికిరణ్ అనే బాలుడు అస్వస్థతకు గురయ్యాడు. కాగా వీరికి కొద్ది దూరంలో ఉన్న మరో బాలుడు అఖిలేశ్(టింకు) భయంతో గ్రామంలోకి పరుగులు తీసి గ్రామస్తులకు చెప్పాడు. వారు కుంట కట్టపై ఉన్న చెట్టు వద్దకు వెళ్లి ముగ్గురు చిన్నారులను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాని అప్పటికే ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. రవికిరణ్‌కు తృటిలో పెను ప్రమాదం తప్పింది. ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రవికిరణ్



యశ్వంత్, ప్రసాద్ మృతదేహాలు

కుటుంబాల నేపథ్యం..

పిడుగుపాటుకు మృతి చెందిన చిన్నారుల్లో నడిపల్లి ఐలేని,లక్ష్మి దంపతులకు ముగ్గురు కుమారులు. వీరిలో రెండవ కుమారుడు అనారోగ్యంతో కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. పెద్ద కుమారుడు, మృతుడు యశ్వంత్(13) తూప్రాన్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల 9వ తరగతి పూర్తి చేశాడు. వీరిది వ్యవసాయ కుటుంబం. కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ముగ్గురు కుమారుల్లో ఇద్దరు కుమారులు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. అలాగే పంబల్ల ముత్యాలు, లక్ష్మి దంపతులకు ముగ్గురు సంతానం. ఇద్దరు కుమారులు, కుమార్తె. ఐదేళ్ల క్రితం భర్త ముత్యాలు అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి తల్లి కూలీ పనులు చేసుకుంటూ తన పిల్లలను పోషించుకుంటుంది. రెండవ కుమారుడు మృతుడు ప్రసాద్(15) బ్రహ్మణపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశాడు. పిడుగుపాటుకు గురై చనిపోవడంతో ఆ తల్లి రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి.

నాయకుల పరామర్శ, సాయం

విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో మార్చురీలో ఉన్న చిన్నారుల మృతదేహాలను పరిశీలించి మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే మున్సిపల్ మాజీ చైర్మన్లు రాఘవేందర్‌గౌడ్, మామిళ్ల జ్యోతి కృష్ణ, కాంగ్రెస్ పట్టణ శాఖ అధ్యక్షుడు రవీందర్‌గుప్త, మాజీ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్ మృతుల కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ దొంగ అరెస్ట్

– మూడు బైక్‌లు స్వాధీనం

జహీరాబాద్ టౌన్: బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. జహీరాబాద్ టౌన్ ఎస్ఐ కాశీనాథ్ కథనం ప్రకారం... కర్నాటక రాష్ట్రంలోని బీదర్ జిల్లా దేవగిరి తండాకు చెందిన కైలాష్(33) పార్కు చేసిన బైక్‌లను దొంగిలించి బీదర్, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో అమ్ముతున్నాడు. శనివారం పస్తాపూర్ కమాన్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా టీఎస్15 ఈజీ 7503 నంబర్ గల మాస్ట్రోపై వెళ్తున్న క్రమంలో అతడిని ఆపి బైక్ పత్రాలు అడుగగా చూపించలేదు. అనుమానం వచ్చి విచారించగా మూడు బైక్‌లు చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. కోర్టులో రిమాండ్ చేశామని ఎస్ఐ తెలిపారు.


స్వాధీనం చేసుకున్న బైక్‌లు, దొంగతో ఎస్ఐ.కాశీనాథ్, సిబ్బంది

నగల కోసమే హత్య చేశారా?

- మల్లమ్మను కిడ్నాప్ చేసి హత్య చేశారని అనుమానం
- ఘటనా స్థలాన్ని సందర్శించిన తూప్రాన్ డీఎస్పీ వెంకట్ రెడ్డి

నర్సాపూర్ రూరల్: అదృశ్యమైన వృద్ధురాలు హత్యకు గురై నర్సాపూర్ మండలం తుజాల్ పూర్ – ఖాజీపేట రోడ్డులోని ఓ కల్వర్టు కింద కుళ్లిన స్థితిలో మృతదేహమై కనిపించింది. నర్సాపూర్ ఎస్సై లింగం వివరాల ప్రకారం... తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన గాలి మల్లమ్మ (60) ఈనెల 13న ఇంటి నుంచి రేషన్ సరుకుల కోసం వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కుమారుడు గాలి శ్రీనివాస్‌తోపాటు కుటుంబ సభ్యులు ఆమె కోసం వెతికినా ఆచూకీ తెలియలేదు. 14న ఆమె కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు ప్రారంభించారు. అటుగా వెళ్తున్న కొంతమంది శనివారం ఉదయం తుజాల్ పూర్ – ఖాజీపేట రోడ్డులోని కల్వర్టు కింద కుళ్లిన మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి పోలీసులు పరిశీలించగా గాలి మల్లమ్మగా గుర్తించారు. మల్లమ్మ ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాల కోసమే గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసి కల్వర్టు కిందకి తీసుకెళ్లి నగలను దోచుకొని హత్య చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. అదృశ్యమైన కేసును హత్య కేసుగా నమోదు చేసుకున్నారు. ఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా ఘటనా స్థలాన్ని తూప్రాన్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, నర్సాపూర్ సీఐ జాన్ రెడ్డి సందర్శించి త్వరలోనే దుండగులను పట్టుకుంటామని తెలిపారు.


ఘటనా స్థలాన్ని సందర్శించిన తూప్రాన్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, సీఐ జాన్ రెడ్డి

పేకాటరాయుళ్ల అరెస్టు

జహీరాబాద్ టౌన్: పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. టౌన్ ఎస్ఐ కాశీనాథ్ వివరాల ప్రకారం.. జహీరాబాద్ పట్టణంలోని ఐడీఎస్ఎంటీ కాలనీ ప్రాంతంలో పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు శనివారం రైడ్ చేశారు. ఈ రైడ్‌లో 5 మంది మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 7,920 నగదు, మూడు సెల్‌ఫోన్లు, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకొని సుమోటో కేసు నమోదు చేశారు.

'పచ్చిరొట్ట' కోసం ఎదురుచూపులు

వానాకాలం సాగుకు జీలుగు, జనుము, విత్తనాలు కరువు

- షాపుల చుట్టూ తిరుగుతున్న రైతులు
- అన్నదాతకు సాగు ఆరంభంలోనే తిప్పలు
- ముందస్తు ప్రణాళికపై అధికారుల నిర్లక్ష్యం

కోహెడ(హుస్నాబాద్): భూసారం పెంచేందుకు రైతులు పొలం దున్నకానికి ముందు దుక్కి చదును చేసి వినియోగించే సేంద్రియ ఎరువు (పచ్చిరొట్ట) విత్తనాలు దొరకడం లేదు. ఏటా వర్షాకాలం ఆరంభంలో పచ్చిరొట్ట ఎరువుగా వినియోగించే జీలుగు, జనుము సరఫరా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పక్షం రోజులుగా దుక్కులు చదును చేసి పచ్చిరొట్ట ఎరువుల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ఎరువుల షాపులలో అధికారులు అందుబాటులో ఉంచకపోవటంతో రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.


కోహెడలో జీలుగు విత్తనాల కోసం షాపునకు వచ్చి వెనుదిరుగుతున్న రైతులు

2350 ఎకరాల్లో వరి సాగు

ఈసారి వర్షాకాలం 2350 ఎకరాల్లో వరి సాగు కానుందని అధికారులు అంచనా వేశారు. పచ్చిరొట్ట ఎరువు వినియోగంపై సదస్సులు నిర్వహించే వ్యవసాయ అధికారులు విత్తనాలు అందుబాటులో ఉంచకపోవడం శోచనీయం. సీజన్ ఆరంభం నుంచే అన్నదాతలకు సవాళ్లు స్వాగతం పలుకుతున్నాయి. అధికారుల ముందస్తు ప్రణాళిక లేని కారణంగా రైతులకు తీరని శాపంగా మారుతోందని మండల రైతాంగం అభిప్రాయం వ్యక్తం చేస్తోంది. రోహిణి కార్తె ఈ నెల 25 నుంచి ప్రారంభం కానుంది. అలాగే 29 నుంచి రుతుపవనాలు రానున్నాయని వాతావరణ శాఖ అధికారులు చెప్పడంతో రైతులు నారుమడులు సైతం సిద్ధం చేశారు. ఈ కార్తెలో విత్తనం భూమిలో పడితే దిగుబడి అధికంగా వస్తుందని రైతుల నమ్మకం. నీటి కొరత లేని రైతులు వానాకాలం సాగుకు సన్నద్ధమవుతున్నారు.

ఎన్ఎస్‌కు విత్తనాల బాధ్యత

నియోజకవర్గ వ్యాప్తంగా పచ్చిరొట్ట విత్తనాల సరఫరాను నేషనల్ సీడ్ కార్పొరేషన్ (ఎన్ఎస్) బాధ్యతలు తీసుకున్నట్లు సమాచారం. తెలంగాణ సీడ్ కార్పొరేషన్ (టీఎస్) విత్తనాల సరఫరా బాధ్యతలు తీసుకున్న ప్రాంతాల్లో పచ్చిరొట్ట విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయి. కానీ ఎన్ఎస్ సరఫరా బాధ్యతలు తీసుకున్న ప్రాంతాల్లో నేటికీ సరఫరా కాకపోవడం గమనార్హం.

దుక్కి దున్ని సిద్ధంగా ఉంచాం



పచ్చిరొట్ట ఎరువు కోసం దుక్కి దున్ని సిద్ధంగా ఉంచా. జీలుగు, జనుము విత్తనాలు షాపుల్లో అందుబాటులో లేవు. దీంతో 15 రోజుల నుంచి ఎదురు చూస్తున్న. అధికారులు ఇప్పటికైనా త్వరగా పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు సరఫరా చేయాలి.

– బుర్ర కనకయ్య, రైతు నకిరకొమ్ముల

రెండు రోజుల్లో అందుబాటులోకి..



జీలుగు, జనుము విత్తనాలు రెండు రోజుల్లో అందుబాటులోకి వస్తాయి. రైతులు ఆందోళన చెందాల్సినవసరం లేదు. మండల వ్యాప్తంగా జీలుగు 580 టన్నులు, 70 టన్నుల జనుము విత్తనాలు అవసరం ఉందని ఉన్నతాధికారులకు నివేదించాం.

– సతీశ్, ఏఓ కోహెడ